క్లుప్తంగా

పద్మశాలి ఆత్మగౌరవ భవనం భూమిపూజకు తరలిరండి

చైతన్యపురి: పద్మశాలి ఆత్మగౌరవ భవనం భూమి పూజకు కుల బాంధవులంతా తరలిరావాలని పద్మశాలి వెల్ఫేర్‌ ట్రస్ట్‌ సభ్యుడు రాపోలు సుధాకర్‌ ఒక ప్రకటనలో కోరారు. కోకాపేటలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు భవన శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు హాజరవుతారని ఆయన అన్నారు. పద్మశాలి నాయకులు, ప్రజాప్రతినిధులు, చేనేత సహకార సంఘాల బాధ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్‌ గుప్తా, ఏసీపీ శ్రీధర్‌రెడ్డి

లింగోజిగూడ: విద్యతో పాటు క్రీడాలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర టూరిజం అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా అన్నారు. నాగోలు బండ్లగూడలోని వీ స్పోర్ట్స్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నల్‌ ఫుట్‌బాల్‌ లీగ్‌ పోటీల్లో విజయం సాధించిన టీంలకు శుక్రవారం సాయంత్రం బహుమతులు అందజేశారు. పోటీల్లో దానియెల్‌ టీం విజయం సాధించగా, రిషీ టీం రన్నర్‌గా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్‌ గుప్తా మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందని, యువత క్రీడాల్లో రాణించేందు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్‌ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, కోచ్‌ సందీప్‌, పి.నరేష్‌ కుమార్‌, జి.రాజు, వినోద్‌ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్‌ క్యాంప్‌ ముగింపు వేడుకలు

కాచిగూడ: హిమాయత్‌నగర్‌లోని అక్స్‌ఫర్డ్‌ గ్రామర్‌ హైస్కూల్‌లో నిర్వహించిన సమ్మర్‌ క్యాంప్‌ శిక్షణ తరగతులు ముగిశాయి. శుక్రవారం అనేక విభాగాల్లో శిక్షణ తరగతులు నిర్వహించగా.. కళ, క్రాఫ్ట్‌, అవుట్‌డోర్‌, ఇండోర్‌గేమ్‌లు పిల్లల్లో ఉత్సాహాన్ని నింపాయి. ముగింపు వేడుకల్లో స్కూల్‌ కరస్పాండెంట్‌ కట్ట ప్రభాకర్‌, ప్రిన్సిపాల్‌ రామాంజుల ఫాతీమా కాజిమ్‌, బాలరాజ్‌ తదితరులు పాల్గొని విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

తహసీల్దార్‌కు సన్మానం



బాలాపూర్‌ తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రేషన్‌ డీలర్లు

బడంగ్‌పేట్‌: బాలాపూర్‌ మండల తహసీల్దార్‌ జనార్దన్‌రావును రేషన్‌ డీలర్ల మండల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక అభయాంజనేస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తహసీల్దార్‌ను శాలువలతో సన్మానించారు. అనంతరం తహసీల్దార్‌ జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బాలాపూర్‌ మండల రేషన్‌ డీలర్ల సంఘం అధ్యక్షుడు టీకుల శశిధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌ దండు గణేశ్‌ ముదిరాజ్‌, సురేష్‌గుప్తా, కృష్ణగౌడ్‌, డిప్యూటీ తహసీల్దార్‌ ఆదిత్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బీసీ కులవృత్తులకు పునరుజ్జీవం

కాచిగూడ: బీసీ కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన రూ.లక్ష పథకంతో కులవృత్తుల పునరుజ్జీవం జరుగుతుందని జాతీయ బీసీదళ్‌ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. శుక్రవారం కాచిగూడలో జరిగిన బీసీ కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం అమలుకు రాష్ట్రప్రభుత్వం బీసీ కులసంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కష్టకాలంలో ఉన్న బీసీలను ఆదుకునేలా సీఎం కేసీఆర్‌ ఈ పథకాన్ని ప్రకటించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీసీదళ్‌ నేతలు అయ్యాన్‌, సాయియాదవ్‌, శ్రీను, అఖిల్‌, చరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారు ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాటా 15, వంకాయ 28, బెండ 26, పచ్చిమిర్చి 40, కాకర 45, బీర 35, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్‌ 55–75, క్యారెట్‌ 37, దొండ 13–18, చిక్కుడు 55, గోకర 45, బీట్‌రూట్‌ 19, క్యాప్సికం 55, ఆలు 19, దోస 17, సొర 13, పొట్ల 10, ఉల్లి 12, చామగడ్డ 35. శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.



నడిరోడ్డుపై ఏడాదిగా ఇదే పరిస్థితి



గౌతంనగర్‌లో దేవి మెడికల్‌ హాల్‌ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌



గౌతంనగర్‌ రోడ్‌ నం-3లో మూతలేని మ్యాన్‌హోల్‌

ఎన్నాళ్లిలా..?

- ప్రధాన రోడ్లపై పగిలిన మ్యాన్‌హోళ్లు
- మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యం
- బారికేడ్లు పెట్టి చేతులు దులుపుకుంటున్న వైనం
- ప్రమాదాల బారిన పాదచారులు, ద్విచక్రవాహనదారులు

చైతన్యపురి: మ్యాన్‌హోళ్లు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి.. మ్యాన్‌హోళ్ల నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే అవి పగిలిపోయి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గడ్డిఅన్నారం డివిజన్‌ గౌతంనగర్‌ కాలనీలో రహదారుల మధ్యలో ఏర్పాటు చేసిన మ్యాన్‌హోళ్లు, వాటి కవర్లు పాడైపోయి పూర్తిగా లోనికి కుంగిపోయి దర్శనమిస్తున్నాయి. ఏడాది కాలంగా ఇదే పరిస్థితి ఉన్నా .. జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కానీ అధికారులు పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాడైపోయిన మ్యాన్‌హోళ్లను పునర్నిర్మించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

- గౌతంనగర్‌ కాలనీలోని కొన్ని మ్యాన్‌హోళ్ల కవర్లు ధ్వంసం కావడంతో నోరుతెరుచుకుని ప్రమాదకరంగా మారాయి.
- కాలనీకి వచ్చే ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్‌ పాడై ఏడాది దాటిందని, అధికారులు మరమ్మతు చేయకుండా చుట్టూ బారికేడ్లు పెట్టి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు తెలిపారు.
- పట్టణ ప్రగతి కార్యక్రమంలో మ్యాన్‌హోళ్ల సమస్యపై ఎమ్మెల్యే, జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయిందంటున్నారు.
- పగిలిన మ్యాన్‌హోళ్లపై ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని కాలనీవాసులు తెలిపారు.
- కాలనీలోని ఓ మ్యాన్‌హోల్‌లో ఇటీవల ఆటో పడి ప్రమాదానికి గురైందని వారు చెప్పారు.
- వర్షం వస్తే రహదారిపై వరద నీరు చేరి మ్యాన్‌హోల్‌ గుంత ఎక్కడ ఉందో తెలియక వాహనదారులు, పాదచారులు అదుపుతప్పి పడిపోతున్నారని కాలనీవాసులు పేర్కొన్నారు.
- రహదారి ఎత్తు, పల్లాలు ఉండటం, వర్షం పడ్డప్పుడు నీరు వెళ్లే మార్గం లేక అలాగే నిలిచి రోడ్లు కూడా పాడైపోతున్నాయని చెబుతున్నారు.
- కార్పొరేటర్‌, అధికారులకు పలు పర్యాయాలు వినతిపత్రం సమర్పించినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.
- పగిలిన, కృంగిన వాటి స్థానంలో వచ్చే వర్షాకాలంలోపు కొత్త మ్యాన్‌హోళ్లు నిర్మించి, వాటిపై కవర్లు వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?



కాలనీలో మ్యాన్‌హోల్‌ పాడైందని ఏడాది క్రితమే అధికారులకు ఫిర్యాదు చేశాం. పట్టణ ప్రగతి కార్యక్రమంలో వినతి పత్రం ఇస్తే త్వరలో సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయినా పట్టించుకోవటం లేదు. ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేయాలంటే సంవత్సరాలు పడుతుందా..? ముక్కుపిండి పన్నులు వసూలు చేసే అధికారులకు ప్రజా సమస్యలు పట్టవా. ప్రమాదాలు జరిగి ఎవరైనా ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం

–క్లెం మధుసూదన్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, గౌతంనగర్‌

నిజాయితీ చాటుకున్న మహిళా బస్‌ కండక్టర్‌



బ్యాగును ప్రయాణికుడికి అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

హయత్‌నగర్‌: బస్సులో మరిచిపోయిన డబ్బుల బ్యాగును భద్రపర్చి ప్రయాణికుడికి అందజేసి తనలోని నిజాయితీని చాటుకుందో మహిళా కండక్టర్‌. హయత్‌నగర్‌ 1 బస్‌డిపో మేనేజర్‌ రఘు కథనం ప్రకారం... డిపోకు చెందిన మహిళా కండక్టర్‌ రాధిక శుక్రవారం ఉదయం హయత్‌నగర్‌–జేబీఎస్‌ రూట్‌లో (ఏపీ11 జెడ్‌7111) బస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సన్‌షైన్‌ మెడికల్‌ కళాశాల ప్రిన్సిపల్‌ ఏవీఎస్‌ రెడ్డి పనామా వద్ద బస్సు ఎక్కారు. తొందరలో ఆయన తన బ్యాగును బస్సులో మరిచిపోయి సికింద్రాబాద్‌లో దిగిపోయారు. బస్సు జేబీఎస్‌కు వెళ్లిందని తెలుకున్న ఏవీఎస్‌ రెడ్డి ఆటోలో అక్కడికి వెళ్లి ఆర్టీసీ అధికారుల సహకారంతో విషయాన్ని డిపో మేనేజర్‌ రఘు దృష్టికి తీసుకొచ్చారు. డీఎం కండక్టర్‌తో మాట్లాడి బ్యాగును హయత్‌నగర్‌ బస్‌ స్టేషన్‌ అధికారి శంకరయ్యకు అందజేయగా బ్యాగులో రూ.35 వేల నగదు, విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయి. శంకరయ్య తమ సిబ్బందితో కలిసి బ్యాగును ప్రయాణికుడికి అందజేశారు. బ్యాగును భద్రపర్చి ప్రయాణికుడికి అందజేసిన కండక్టర్‌ రాధికను అందరూ అభినందించారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయండి



నాలా పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్‌ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్‌: డివిజన్‌ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఐఎస్‌ సదన్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ జంగం శ్వేతామధుకర్‌ రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం కార్పొరేటర్‌ జీహెచ్‌ఎంసీ అధికారులు, లక్ష్మీనగర్‌ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి లక్ష్మీనగర్‌ నుంచి ఎర్రకుంట వరకు ఎస్‌ఎన్‌డీపీ ఆధ్వర్యంలో నిర్మించనున్న నాలా పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్‌ నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా అధికారులు తరచూ పర్యవేక్షిస్తుండాలన్నారు. వర్షాకాలం లోపు ఈ నాలా పనులను పూర్తి చేయాలని, తద్వారా ముంపు సమస్య పరిష్కారమవుతుందని కార్పొరేటర్‌ కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ అన్సారీ, కాలనీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శివారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజేందర్‌, విశాల్‌ పాల్గొన్నారు.

'మహాజన్‌ సంపర్క్‌ అభియాన్‌'ను విజయవంతం చేయాలి



బీజేపీలో చేరిన వారితో సామ రంగారెడ్డి తదితరులు

హయత్‌నగర్‌: నరేంద్రమోదీ ప్రధానిగా 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 30 నుంచి జూన్‌ 30 వరకు నిర్వహించే మహాజన్‌ సంపర్క్‌ అభియాన్‌ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అర్బన్‌ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హయత్‌నగర్‌ డివిజన్‌ శాంతివనం టౌన్‌షిప్‌లో జరిగిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో స్థానిక కార్పొరేటర్‌ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. నెల రోజుల్లో మొత్తం తొమ్మిది కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ అధిష్టానం పిలుపు ఇచ్చిందన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే యోగా కార్యక్రమానికి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలని, జూన్‌ 21న జరిగే యోగా డే సందర్భంగా ప్రతి డివిజన్‌లోని బూత్‌ స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. 23న శ్యాంప్రసాద్‌ ముఖర్జీ బలిదాన్‌ దివస్‌ సందర్భంగా ఆయనకు నివాళులర్పించాలని, 28న ప్రధానమంత్రి మన్‌కీ బాత్‌ రేడియో ప్రసంగాన్ని స్థానికులు వినే విధంగా చూడాలన్నారు. జూన్‌ 23 నుంచి 30 వరకు ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం చేయలని వారు కోరారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌ కాలనీకి చెందిన పలువురు యువకులు పార్టీలో చేరారు. సమావేశంలో డివిజన్‌ పార్టీ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, గోవిందాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌ ఫలితాల్లో 'నారాయణ' జయకేతనం



ర్యాంకర్లతో నారాయణ కళాశాల అధ్యాపక బృందం

దిల్‌సుఖ్‌నగర్‌: ఎంసెట్‌ ఇంజినీరింగ్‌ ఫలితాల్లో దిల్‌సుఖ్‌నగర్‌ నారాయణ డే స్కాలర్‌ విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. రాష్ట్రస్థాయిలో 147 ర్యాంకుతో మొదటి స్థానంలో నాగసాయి అనే విద్యార్థి నిలిచాడు. అదే విధంగా 500 ర్యాంకులోపు ఐదుగురు విద్యార్థులు, వెయ్యిలోపు ర్యాంకులు 18 మంది, ఐదు వేలలోపు 115 మంది, 10 వేల లోపు 221 మంది విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం అభినందించింది. కార్యక్రమంలో కోర్‌ డీన్‌ రాధాకృష్ణ, డీన్‌ అమరేందర్‌, డీజీఎం రాజు, ప్రిన్సిపాల్‌ జగదీష్‌, దామోదర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద కాలువ నిర్మాణానికి సహకరిస్తాం..

- 'సాక్షి' కథనానికి స్పందన

వనస్థలిపురం: 'పూర్తికాని వరద కాలువ పనులు... ముంచుకొస్తున్న ముంపు ముప్పు', శారదానగర్‌ కాలనీ సమీపంలో వరద కాలువ నిర్మాణానికి స్థలం ఇచ్చేందుకు సహకరించని స్థల యజమానులు శీర్షికన శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి స్థల యజమానులు స్పందించారు. స్థల యజమానుల్లో ఒకరైన బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్‌ సామ ప్రభాకర్‌ రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ.. తమ స్థలం నుంచి కాలువ నిర్మాణం విషయమై జీహెచ్‌ఎంసీ అధికారుల నుంచే సరైన చర్యలు లేవన్నారు. తమకు నోటీసులు ఇవ్వడం గానీ, తమతో చర్చించడం గానీ జరగడం లేదన్నారు. కాలనీలు వరద ముంపు బారిన పడకుండా వరద కాలువ నిర్మాణానికి తమవంతు సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

డ్రెయిన్‌ పనులు త్వరగా పూర్తి చేయండి: ఎమ్మెల్యే



డ్రెయిన్‌ పనుల ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: సరూర్‌నగర్‌ చెరువు లోతట్టు కాలనీల ముంపు నివారణకు చేపట్టిన డ్రెయిన్‌ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శంకీశ్వర బజార్‌ చౌరస్తా, శివగంగా థియేటర్‌ ప్రాంతాల్లో జరుగుతున్న డ్రెయిన్‌పనులను ఎస్‌ఎన్‌డీపీ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సింగరేణి కాలనీ మీదుగా వచ్చే వరద నీరు శంకీశ్వరబాజార్‌, శివగంగా థియేటర్‌ ప్రాంతాల్లో రహదారులపై ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందుకే సమస్య పరిష్కారానికి డ్రెయిన్‌ నిర్మాణం చేపట్టామన్నారు. సరూర్‌నగర్‌ లోతట్టు కాలనీలు కోదండరాం కాలనీ, రెడ్డి బ్రదర్స్‌ గల్లీ ప్రాంతంల్లో బాక్స్‌ డ్రెయిన్‌ వల్ల వరద ముంపు కొంత మేర నివారించ వచ్చన్నారు. పనులు పూర్తయితే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌డీపీ చీఫ్‌ ఇంజినీర్‌ కిషన్‌, జీహెచ్‌ఎంసీ చీఫ్‌ ఇంజినీర్‌ జయావుద్దీన్‌, ఈస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ పంకజ, అధికారులు భాస్కర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి స్థానిక నేతలు భవానీ ప్రవీణ్‌కుమార్‌, శ్రీశైలంయాదవ్‌, రమణారెడ్డి, శివకుమార్‌, విక్కీ పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌కు సర్టిఫికెట్‌ అందజేస్తున్న నిర్వాహకులు

మలక్‌పేట: రక్తదానం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని మలక్‌పేట ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ మధి ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. హంగర్‌ వెల్ఫేర్‌ ఆర్గనైజేషన్‌, తలసేమియా సికిల్‌ సొసైటీ, అబు ఐమల్‌ సంయుక్తాధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం శుక్రవారం మూసారంబాగ్‌ మహమ్మదీయ మసీద్‌ ఆవరణలో రక్తదానం శిబిరం నిర్వహించారు. తలసేమియా అండ్‌ సికిల్‌ సెల్‌ సొసైటీ వుప్పుల వెంకటయ్య మెమోరియల్‌ బ్లడ్‌బ్యాంక్‌ వారు రక్తాన్ని సేకరించారు. మలక్‌పేట ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌తో పాటు 110 మంది రక్తదానం చేయగా.. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ జాయింట్‌ సెక్రటరీ అలీమ్‌ బేగ్‌, ఇమద్‌ అలీ, సయ్యద్‌ సోహిబ్‌, షాహ ఉల్‌ హమీద్‌, ఇస్లాం అలీ, మహ్మద్‌ అహ్మద్‌ డాక్టర్‌ సుమన్‌జైన్‌ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే వార్డు కార్యాలయాలు



జ్యోతిప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న డైరెక్టర్‌ శ్రీనివాస్‌

లింగోజిగూడ: సమస్యల సత్వర పరిష్కారం కోసమే వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ టౌన్‌ ప్లానింగ్‌ డైరెక్టర్‌ శ్రీనివాస్‌ తెలిపారు. వార్డు కార్యాలయాల ఏర్పాటుపై శుక్రవారం ఎల్‌బీనగర్‌లో జీహెచ్‌ఎంసీ 30 సర్కిళ్ల డీసీలు, టౌన్‌ ప్లానింగ్‌ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ మాట్లాడుతూ, చిన్న చిన్న సమస్యలకు సర్కిల్‌ కార్యాలయాలకు రాకుండా వార్డు కార్యాలయాల్లోనే పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని, పెద్ద సమస్యలు ఉంటనే సర్కిల్‌ కార్యాలయాలకు రావాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్‌ సిటీ ప్లానర్‌ దేవేందర్‌రెడ్డి , ఎల్‌బీనగర్‌ జోన్‌ సిటీ ప్లానర్‌ ప్రసాద్‌ రావు, డీసీలు అరుణాకుమారి, సురేందర్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

మన్సూరాబాద్‌: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలతో దేశంలో మార్పులు వచ్చాయని, శరవేగంగా దేశం అభివృద్ధి చెందుతోందని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌, కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. బీజేపీ మన్సూరాబాద్‌ డివిజన్‌ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం డివిజన్‌ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్‌ అధ్యక్షతన శుక్రవారం కార్పొరేటర్‌ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. సమావేశానికి కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డితో పాటు బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకుడు కటక నర్సింగ్‌రావు, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్ర శంకర్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని, ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డివిజన్‌లో కార్పొరేటర్‌గా తాను చేపడుతున్న అభివృద్ధి పనులపై బీఆర్‌ఎస్‌ నేతలు అబద్ధపు ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు హరీశ్‌రెడ్డి, పాతూరి శ్రీధర్‌గౌడ్‌, కొండల్‌రెడ్డి, సాయిరాం గౌడ్‌, వెంకట్‌రెడ్డి, చిల్కూరి మాధవి, కవితారెడ్డి, కర్నాటి మాధవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ నర్సింహారెడ్డి

జాతీయ రహదారిపై మురుగు ప్రవాహం



సుష్మా చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై పారుతున్న మురుగునీరు



చౌరస్తాలో మ్యాన్‌హోల్‌ నుంచి పొంగుతున్న డ్రైనేజీ

ఇబ్బంది పడుతున్న వాహనదారులు

వనస్థలిపురం: విజయవాడ జాతీయ రహదారిపై వనస్థలిపురం సుష్మా చౌరస్తా సమీపంలో చాలా రోజులుగా మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు పొంగి పొర్లుతూ రోడ్డుపై పారుతోంది. దీంతో ఆ దారిన వెళ్తున్న వాహనదారులు మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మురుగు ప్రవాహంతో దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. ఈ సమస్య చాలా కాలంగా ఉన్నా.. పరిష్కారానికి అధికారులు పూనుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్లకు మరమ్మతులు చేపట్టి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

దశల వారీగా కాలనీల అభివృద్ధి



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న చైతన్యనగర్‌ వాసులు

లింగోజిగూడ: దశల వారీగా కాలనీలను అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని బీఎన్‌రెడ్డి నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధిలోని వీరాంజనేయ కాలనీ, శ్రీనివాసపురం, జక్కిడినగర్‌ కాలనీ, అనంతవేణి నగర్‌, ఆఫీసర్స్‌ కాలనీ, పద్మావతి కాలనీ, సాగర్‌ హౌసింగ్‌ కాంప్లెక్స్‌ ఫేజ్‌–2, గాంధీనగర్‌ సౌత్‌, బీఎన్‌రెడ్డి నగర్‌ ఫేజ్‌–3, చైతన్యనగర్‌ కాలనీలకు నూతనంగా హైమాస్ట్‌ లైట్లు మంజూరు కావడంతో శుక్రవారం విద్యుత్‌ ఏఈ జగన్నాథంతో కలిసి ఆయా కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కాలనీల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. పలు చోట్ల విద్యుత్‌ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, చిత్రాంజన్‌, యాదిరెడ్డి, రాజుగౌడ్‌, బాలజీ, బాలనరసింహ, రామయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు సన్మానం..

చైతన్యనగర్‌ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం స్థానిక కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం కాలనీలో నెలకొన్న పలు సమస్యలను కార్పొరేటర్‌ దృష్టికి కాలనీవాసులు తీసుకొచ్చారు. కాలనీ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి బుగ్గయ్య, సభ్యులు సంజీవరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి



మార్కెట్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన చైర్‌పర్సన్‌ అనితానాయక్‌

చాదర్‌ఘాట్‌: మలక్‌పేటలోని హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌లో రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని మార్కెట్‌ చైర్‌పర్సన్‌ అనితానాయక్‌ తెలిపారు. మార్కెట్‌ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మలక్‌పేట మార్కెట్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మార్కెట్‌కు వచ్చే రైతులు, వినియోగదారులు, హమాలీలకు వేసవి కాలంలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌ ఎస్‌జీఎస్‌ దామోదర్‌, గ్రేడ్‌–3 కార్యదర్శి రవీందర్‌, డైరెక్టర్‌ రాము యాదవ్‌, వెంకటరమణ, వివేకానంద పాల్గొన్నారు.